# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 17, మార్చి 2026




### ప్రేమ పేరుతో పాశవికం...

# గిరిజన యువతి దారుణహత్య

- పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి... అడవిలోకి తీసుకెళ్లి దారుణం
- నిందితుడిని అదుపులోకి తీసుకోని కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**పెంచికల్‌పేట్, మార్చి 16, ప్రభాతవార్త :**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ మండలం కొండపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జైహింద్పూర్ అటవీ ప్రాంతంలో గిరిజన యువతి దారుణ హత్యకు గురైన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కొండపల్లి గ్రామానికి చెందిన ఆత్రం సమ్మక్క (25) కు జైహింద్పూర్ గ్రామానికి చెందిన వివాహితుడు కేర్కరి జలపతితో కొంతకాలంగా ప్రేమ సంబంధం కొనసాగుతోంది. ఇటీవల యువతి తనని పెళ్లి చేసుకోవాలని సదరు ప్రియుడిపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం సమ్మక్క జలపతి వద్దకు వెళ్లింది. అయితే ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఇదే సమయంలో సోమవారం ఉదయం జైహింద్పూర్ అటవీ ప్రాంతంలో యువతి హత్యకు గురైనట్లు సమాచారం బయటకు రావడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న కాగజ్ నగర్ రూరల్ సీఐ కుమార స్వామి, పెంచికల్ పేట్ ఎస్సై అనిల్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. నిందితుడు జలపతిని అదుపులోకి తీసుకుని అడవిలోని ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ లభ్యమైన మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సంఘటన స్థలాన్ని కాగజ్ నగర్ డీఎస్పీ వాహిదోద్దీన్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మృతురాలి సోదరి ఆత్రం మిరియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

### సింగరేణి యాజమాన్యం హామీ మేరకు అధికారుల సమస్యలు

# వెంటనే పరిష్కరించాలి

- కోల్ ఇండియా మాదిరి సింగరేణి అధికారులకు అలవెన్స్‌లు చెల్లించాలి
- సింగరేణి అధికారుల సమస్యలు తీర్చాలని వినతి




**జైపూర్, మార్చి 16, ప్రభాతవార్త**

సింగరేణి అధికారుల సమస్యలకు పరిష్కారం చూపుతామని సింగరేణి యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు అన్ని సమస్యలు పరిష్కరించాలని సీ.ఎం.ఓ.ఏ.ఐ ప్రెసిడెంట్ దరావత్ పంతులా డిమాండ్ చేశారు. సీ.ఎం.ఓ.ఏ.ఐ ఎస్.సి.సి.ఎల్ బ్రాంచ్ కేంద్ర కమిటీ ఆదేశాల అనుసారంగా సింగరేణి అధికారుల సమస్యలు తీర్చాలంటూ సోమవారం సీ.ఎం.ఓ.ఏ.ఐ ప్రెసిడెంట్ దరావత్ పంతులా, సీఎంఓఏఐ వైస్ ప్రెసిడెంట్ జనగామ శ్రీనివాస్,అప్పారావు , సీఎంఓఏఐ జాయింట్ ట్రెజరర్ టి. మోహన్ సింగ్‌ల ఆధ్వర్యంలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఈ.డి చిరంజీవి కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఎంఓఏఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ డి పంతులా మాట్లాడుతూ, సింగరేణి అధికారులకు జీతభత్యాలు, ఇతర ప్రయోజనాలు కోల్ ఇండియా అధికారులకు అందుతున్న ప్రయోజనాల మాదిరిగా సింగరేణి అధికారులకు అందించాలని కోరారు. ఈ మధ్య కాలంలో సి.ఐ.ఎల్ లోని ప్రయోజనాలు సింగరేణి అధికారులకు వర్తింపచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిభ ఆధారిత చెల్లింపు ప్రతి సంవత్సరం జీతం లో భాగంగా చాలా కాలం నుండి పెండింగ్‌లో ఉండడంతో అధికారులు వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని, ఈ రెండు సంవత్సరాలకు సంబంధించిన మిగతా 2లో..

## విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలి

☆ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

– హాజీపూర్, మార్చి 16, ప్రభాతవార్త



2లో..



## జనగణన పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, మార్చి 16, ప్రభాతవార్త**

దేశాభివృద్ధికి జనగణన అత్యంత కీలకమని, ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. జనగణన 2027కు సంబంధించి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన శిక్షణ మిగతా 2లో..

### సిలిండర్లను బహిరంగ మార్కెట్లో

# అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు



- కృత్రిమ కొరత సృష్టించే వారిపై ప్రత్యేక నిఘా
- జిల్లా ఎస్పీ నితిక పంత్

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 16, ప్రభాతవార్త :**

జిల్లాలో వంట గ్యాస్ కొరత లేదని, సిలిండర్లను బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు, కృత్రిమ కొరత సృష్టించే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిలిండర్ల కొరతపై సోషల్ మిగతా 2లో..

### సింగరేణి యాజమాన్యం హామీ మేరకు అధికారుల సమస్యలు

# వెంటనే పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఫైల్ తెలంగాణా ప్రభుత్వం వద్ద సర్క్యులేషన్ లో ఉందని. నవంబర్ నెలలో ఈ విషయమై రిలే నిరాహార దీక్ష చేయుటకు నోటీసు ఇచ్చి, యాజమాన్యం వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం తో వాయిదా వేసినట్లు తెలిపారు. టి.ఏ అండ్ డి.ఏ, సెల్ ఫోన్ రీ ఎంబర్స్ మెంట్, స్పెషల్ స్పెక్టికల్స్ రియింబర్స్మెంట్ మొదలగునవి సీ.ఐ.ఎల్‌లో అమలు చేసినా సింగరేణి లో పట్టించుకోవడం లేదని సీ.ఐ.ఎల్ లో అమలుచేసిన పదోన్నతి ఉత్తర్వులను కూడా సింగరేణిలో అమలు చేయడం లేదన్నారు. తెలంగాణా ప్రభుత్వం అమలు చేసిన ఉచిత విద్యుత్, ఐఐటీ /ఐ.ఐ.ఎం ఫీజు రియింబర్స్మెంట్ అధికారులకు మాత్రం అమలు చేయడం లేదని వాపోయారు క్రమశిక్షణ చర్యల ప్రక్రియ సరైన పద్ధతిలో జరగడం లేదని, వీటిపై తుది నిర్ణయం తీసుకోవడానికి చాలా సమయం తీసుకోవడంతో చాలా మంది అధికారులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పదోన్నతుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, సమస్యల పరిష్కారం కోసం అధికారుల సంఘం సింగరేణి యాజమాన్యాన్ని, మంత్రులు, శాసనసభ్యులను కలిసి సత్వర పరిష్కారం కొరకు విన్నవించడం జరిగినప్పటికీ, ఇప్పటివరకు ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సంస్థ చైర్మన్ దృష్టికి పలు మార్లు తీసుకెళ్లి. నల్ల బ్యాడ్జెస్ ధరించి నిరసన సైతం తెలియజేశామని అన్నారు. . యాజమాన్యం సమస్యల పరిష్కారం చేస్తామని హామీ ఇస్తేనే తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు వాయిదా వేసి యాజమాన్యానికి సహకరించామని తెలిపారు. ఇప్పటివరకు సింగరేణి లో అధికారులు ఆందోళనలు చేయలేదని, అధికారులు తప్పనిసరి పరిస్థితులలో ఆందోళనలు చేయాల్సి వస్తుందని, ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి సమస్యలు సత్వరమే పరిష్కరించి ఆందోళన కార్యక్రమాల జోలికి వెళ్లకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిఎం లు నరసింహారావు, మదన్మోహన్, డిజీఎం శివప్రసాద్, డీజీఎం (ఎప్జిడి) పి మహేందర్ , డీజీఎం (ఫైనాన్స్) శ్రీధర్ , 800 ఎండబ్ల్యు కో ఆర్డినేటర్ వేణుగోపాల్ , ఎస్ఈ (సివిల్) బి. రాము , ఎస్ఈ (సివిల్) పాత్రుడు, ఎస్పోటు ఈడి కే వెంకటయ్య, ఎస్పోటు జిఎం బి శంకర్, సేఫ్టి ఆఫీసర్ పులి సురేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన హోంగార్డులకు ఘన సత్కారం

**- అభినందించిన జిల్లా ఎస్పీ నితికా పంత్**



హోంగార్డులకు సన్మానించిన జిల్లా ఎస్పీ నితికాపంత్

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 16, ప్రభాతవార్త**

కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ శాఖలో దీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందుతున్న ఇద్దరు హోంగార్డులను సోమవారం జిల్లా ఎస్పీ నితికా పంత్ ఘనంగా సత్కరించారు. కాగజ్‌నగర్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న 1984 బ్యాచ్‌కు చెందిన సూర్యం, 1989 బ్యాచ్‌కు చెందిన బిక్షపతి పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా వారికి శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఎన్నో సంవత్సరాలు నిబద్ధతతో, క్రమశిక్షణతో విధులు నిర్వహించిన సూర్యం, బిక్షపతి సేవలను కొనియాడారు. తమ సేవా కాలంలో చూపిన బాధ్యతాయుత వైఖరి ఇతర సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం వారు ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్స్ ఆర్ఐ విద్యాసాగర్, ఆర్ఐ అడ్మిన్ వామనమూర్తి, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కల్పించాలని తహాశీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన పెగడపల్లి గ్రామస్తులు

**జైపూర్, మార్చి 16, ప్రభాతవార్త**

సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్టు ప్రభావిత గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కల్పించాలని కోరుతూ జైపూర్ మండల తహాశీల్దార్‌కు పెగడపల్లి గ్రామ ప్రజలు వినతిపత్రం అందజేశారు. నిత్యం ఎస్టిపిపి నుండి వెలువడే దుమ్ము ధూళి శబ్దాల వల్ల గ్రామ ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నామని అన్నారు. ఎస్టీపిపి ప్రభావిత గ్రామమైన పెగడపల్లి గ్రామ ప్రజలను గ్రామం నుండి వేరే ప్రాంతానికి తరలించాలని వారు కోరారు. ఎస్టీపిపి నుండి వెలువడే బూడిద తమ ఇండ్లపై పడుతుందని దీనివల్ల ప్రజలు, మూగ జీవులు, చెట్లు వ్యాధులకు గురవుతున్నామని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామస్తులు రాజేందర్ రెడ్డి, భాస్కర్, జయకృష్ణ రెడ్డి, రమేష్, ప్రదీప్, శ్రావణ్ కుమార్‌లు వున్నారు.



## హెచ్‌పీవీ వ్యాక్సిన్ పట్ల అపోహలు వద్దు

**- జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్**



హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్

**సారంగాపూర్, మార్చి 16, ప్రభాతవార్త:**

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధానికి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న హ్యూమన్ పాపిల్లో వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్ పట్ల ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని నిర్మల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్ సూచించారు. సోమవారం మండలంలోని జాం సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మారుతున్న జీవన పరిస్థితుల దృష్ట్యా క్యాన్సర్ వ్యాధి వేగంగా విస్తరిస్తోందని, ముఖ్యంగా మహిళల్లో వచ్చే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టిందని ఆయన వివరించారు. 14 ఏళ్లు నిండిన బాలికల నుండి 15 ఏళ్ల లోపు వారు ఈ ఉచిత వ్యాక్సిన్‌కు అర్హులని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇప్పటికే అర్హులైన బాలికల జాబితాను సిద్ధం చేశామని, త్వరలోనే షెడ్యూల్ ఖరారు చేసి వ్యాక్సిన్ అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పవన్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సౌమ్య, వైద్యులు డాక్టర్ అబ్దుల్ జవాద్, మొయిమిల్ అలీ, మాస్ మీడియా అధికారి రవీందర్, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్ గౌడ్, ఉష, పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత పాల్గొన్నారు.

### సిలిండర్లను బహిరంగ మార్కెట్లో

## అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, జిల్లాలో ఎలాంటి కొరత లేదని తెలిపారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వినియోగదారులకు సమయానికి సిలిండర్లు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అక్రమంగా సిలిండర్లను అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే అక్రమ నిల్వలు జరగకుండా, మధ్యవర్తులు అధిక ధరలకు విక్రయించకుండా ప్రత్యేక నిఘా ఉంటుందని, కృత్రిమ కొరత సృష్టించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు .సిలిండర్ బుక్ చేసుకున్న వినియోగదారులకు డెలివరీ బాయ్స్ అధిక ధరలకు విక్రయిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని, అలాంటి వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.



### జనగణన పకడ్బందీగా

## నిర్వహించాలి: కలెక్టర్ అభిలాష అభినవ్

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి ప్రజా ప్రయోజనాల రూపకల్పనకు జనగణన వివరాలే ప్రాతిపదిక అని వివరించారు. గృహాల గుర్తింపు, వివరాల నమోదులో తప్పులు ఉండకూడదని, మాస్టర్ ట్రైనర్లు అందించే అంశాలను అధికారులు క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, సీపీఓ జీవరత్నం, డిపివో శ్రీనివాస్, జెడ్పీ సీఈవో శంకర్ పాల్గొన్నారు. రైతులకు కూరగాయల విత్తనాల కిట్ల పంపిణీఅనంతరం కలెక్టరేట్‌లో రైతులకు ఐదు రకాల కూరగాయల విత్తనాల కిట్‌లను కలెక్టర్ అందజేశారు. జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేలా రైతులు కృషి చేయాలని కోరారు. ఉద్యానవన శాఖ ద్వారా పంపిణీ చేస్తున్న ఈ నాణ్యమైన విత్తనాల ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. మండల కేంద్రాల్లోని ఉద్యానవన అధికారుల ద్వారా ఈ కిట్లను రైతులకు అందజేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి రమణ పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలి

**హాజీపూర్, మార్చి 16, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల పట్టణంలోని రాజీవ్ నగర్ ప్రాంతంలో గల ఆదర్శ పాఠశాలలు సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న మధ్యాహ్న భోజనం ఆహారం నాణ్యత, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. బాలికల వసతి గృహంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం హాజీపూర్ మండలం గుడిపేటలోని చందనాపూర్‌లో గల పట్టణ ఆవాస పాఠశాలను సందర్శించి పాఠశాలలో చేపట్టిన అదనపు గదులు, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వంటశాలను సందర్శించి విద్యార్థుల ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని, ఆహారం తయారీ సమయంలో సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగా అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందని, ఈ నేపథ్యంలో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న కూచడి శ్రీహరి రావు

## కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన కూచడి శ్రీహరి రావు

**సారంగాపూర్, మార్చి 16, ప్రభాతవార్త:**

మండలంలోని కంకెట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడి తండ్రి పెద్దినింటి ధర్మారావు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జ్ కూచడి శ్రీహరి రావు సోమవారం వారి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ధర్మారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## పాఠశాలల్లో ఒంటిపూట బడులు ప్రారంభం

**సారంగాపూర్, మార్చి 16, ప్రభాతవార్త:**

పెరుగుతున్న ఎండల దృష్ట్యా మండలంలోని అన్ని పాఠశాలల్లో సోమవారం నుండి ఒంటిపూట బడులు ప్రారంభమైనట్లు మండల విద్యాశాఖాధికారి మహేందర్ తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న 57 ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలలు కూడా ఈ నిబంధనలను పాటించాలని ఆయన సూచించారు. పాఠశాల పనివేళలు ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఉంటాయని వెల్లడించారు. అయితే, పదవ తరగతి పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో మాత్రం విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా మధ్యాహ్నం 1:00 గంట నుండి సాయంత్రం 4:30 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉంచాలని, ఎండ దెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు పనిచేసేలా చూడాలని, విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని ఎండలో కాకుండా నీడ పట్టున తినేలా ఏర్పాటు చేయాలన్నారు. పిల్లలు ఎండలో ఆటలాడకుండా గమనిస్తూ ఉండాలని, ప్రైవేట్ పాఠశాలలు సైతం ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు.

## అంగన్‌వాడీ, జీపీ భవన నిర్మాణ ప్రొసీడింగ్ కాపీలను అందజేసిన విఠల్‌రెడ్డి

**భైంసా, మార్చి 16, ప్రభాతవార్త:**

ముధోల్ మండలంలోని విట్టోలి తండా అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు, అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ. 12 లక్షలు.. మొత్తం రూ. 32 లక్షల విలువైన ప్రొసీడింగ్ కాపీలను ముధోల్ మాజీ శాసనసభ్యులు జి. విఠల్ రెడ్డి సోమవారం భైంసాలోని తన నివాసంలో గ్రామస్థులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ గ్రామంలో భవన నిర్మాణాల కోసం ప్రత్యేక కృషి చేసిన విఠల్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విట్టోలి తండా సర్పంచ్ జయశ్రీ కాంతారావు, నాయక్ రఘునాథ్, కారోబారి రామారావు, మాజీ ఉపసర్పంచ్ బాబు, శంకర్, జాదవ్ విశ్వనాథ్, జాదవ్ రంగారావు, జయవంతరావు, కుంటాల మాజీ సర్పంచ్ వెంకటేష్, సీనియర్ నాయకులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జి విఠల్ రెడ్డి

## కంకర రాళ్ల రహదారి...

# ప్రమాదకారంగా ఆదిల్‌పేట రూట్

✦ ఎన్నికలకే పరిమితమైన రహదారి పనులు ✦ ప్రాణాలు తీస్తున్న రహదారి గుంతలు

✦ రోడ్డు నిర్మాణం చేయాలని బిజెపి నాయకుల వినతి

**మందమర్రి, మార్చి 16, ప్రభాతవార్త**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం మందమర్రి మండలంలో బీజేపీ నాయకులు వినతిపత్రం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిల్‌పేట దగ్గర ప్రారంభమై జైపూర్ మండలంలోని రసూల్‌పల్లె గ్రామం వరకు వెళ్లే ప్రధాన రహదారిని నూతనంగా నిర్మించాలని కోరుతూ మందమర్రి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి అధికారికి వినతి పత్రాన్ని సమర్పించారు. నాయకులు తెలిపిన వివరాల ప్రకారం ఆదిల్‌పేట నుంచి జైపూర్ ఎక్స్ రోడ్ వరకు వెళ్లే ఈ రహదారిని 2018లో జేసీబీతో తవ్వి వదిలేయడంతో రహదారిపై కంకర తేలి వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. ప్రతి ఎన్నికల ముందు పనులు ప్రారంభించినట్లు చూపించి మధ్యలోనే వదిలేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వర్షం కురిసినప్పుడు గుంతల్లో పడిపోయే ప్రమాదం ఎక్కువగా ఉందని, పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనాలపై చిన్నారులతో ప్రయాణించే సమయంలో కంకర రాళ్ల కారణంగా బండి స్కిడ్ అయి పడిపోవడంతో చిన్నారులు గాయాలపాలై ఆసుపత్రి పాలవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. అంతేకాకుండా ఈ రహదారి ఆదిల్‌పేట నుంచి పొన్నారం, గుడిపల్లి వెంకటాపూర్, కాన్కూర్, ముదిగుంట, మిట్టపల్లి, రసూల్‌పల్లె గ్రామాల మీదుగా జైపూర్‌కు కలిసే ప్రధాన రహదారిగా ఉండి దాదాపు ఏడు గ్రామాల ప్రజలు ఈ మార్గాన్ని వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ రహదారిపై ఉన్న కల్వర్టులు కూడా పూర్తిస్థాయిలో ప్రమాదకరంగా మారాయని, వర్షాకాలంలో నీటి ప్రవాహం ఎక్కువైతే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారిని పూర్తిస్థాయిలో నూతనంగా నిర్మించాలని ఏడు గ్రామాల ప్రజలు కోరుతున్నట్లు నాయకులు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవరనేని సంజీవరావు మందమర్రి మండల ఇన్‌చార్జ్, గిర్నాటి జనార్ధన్ బీజేపీ రూరల్ అధ్యక్షుడు, వంజరి వెంకటేష్ ప్రధాన కార్యదర్శి, కర్రె రాజయ్య మాజీ ఉపసర్పంచ్, మిట్టపల్లి ప్రదీప్ కుమార్ కోశాధికారి, బోర్లకుంట లక్ష్మణ్ ఉపాధ్యక్షుడు, సల్లూరి సుధాకర్ వార్డ్ మెంబర్, దుర్గం మల్లేష్ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్, దుర్గం శ్యామ్ వార్డ్ మెంబర్, నామాసాని చంద్రశేఖర్ వార్డ్ మెంబర్, మంద శ్రీనివాస్ కార్యదర్శి, దశరథం గౌడ్ సారంగపల్లి అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.






కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాసకులు, ఉపాసిక

## నిర్మల్ బుద్ధ విహార్‌లో అంబేద్కర్ భీమ్ దీక్షల ప్రారంభం

**నిర్మల్, మార్చి 16, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని బుద్ధ విహార్‌లో సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భీమ్ దీక్షలు (జ్ఞాన దీక్షలు) ఘనంగా ప్రారంభమయ్యాయి. బుద్ధ విహార్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా గౌతమ బుద్ధుడు, బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు, మాన్యశ్రీ కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పంచశీల ప్రార్థన నిర్వహించారు. ఈ సందర్భంగా 12 మంది ఉపాసకులు, ఒక ఉపాసిక తెల్లని వస్త్రాలు, నీలి కండువాలు ధరించి భీమ్ దీక్షలను స్వీకరించారు. మాన్యశ్రీ కాన్షీరాం జయంతి సందర్భంగా ప్రారంభమైన ఈ దీక్షలు ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల వారు దీక్షా కాలంలో ఎప్పుడైనా దీక్ష స్వీకరించవచ్చని పేర్కొన్నారు. ఈ ఏడాది కుమారి దౌడ భవ్య హర్షిత జ్ఞాన దీక్ష స్వీకరించడం విశేషం. ఈ కార్యక్రమంలో బుద్ధ విహార్ కమిటీ అధ్యక్షులు కుంటోల్ల వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి మధుకర్ మునేశ్వర్, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు కొంతం మురళీధర్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు బత్తుల రంజిత్ కుమార్, టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి గడ్డం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పురుషోత్తం, దౌడ భాస్కర్, భగత్ నారాయణ, జాడే సంజీవ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం రావుల గంగన్న గ్రంథ పఠనం చేయగా, భక్తులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు.

## సింగరేణి ఉద్యోగికి జాతీయ స్థాయి బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు

● తిరుపతిలో పురస్కారాన్ని అందజేసిన బహుజన సాహిత్య అకాడమీ

**నస్పూర్, మార్చి 16, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా నస్పూర్ పట్టణానికి చెందిన సింగరేణి ఉద్యోగి యుగేందర్ సాయి జాతీయ స్థాయి బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డును అందుకున్నారు. తిరుపతిలో ఈ నెల 15న నిర్వహించిన బహుజన సాహిత్య అకాడమీ 18వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. సామాజిక సేవా రంగంలో ఆయన కనబరిచిన విశేష ప్రతిభకు గుర్తింపుగా అకాడమీ ఈ గౌరవాన్ని అందించింది. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా యుగేందర్ సాయి ఈ అవార్డును స్వీకరించారు. కోవిడ్ 19 విపత్తు సమయంలో బాధితులకు అవసరమైన సేవలు అందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. నిరుపేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేస్తూ వారి చదువుకు అండగా నిలుస్తున్నారు. మహనీయుల ఆశయాలను జన బాహుళ్యంలోకి తీసుకెళ్తూ సమాజ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు. యుగేందర్ సాయి సామాజిక సేవలతో పాటు విద్యార్థులకు మోటివేషనల్ స్పీకర్‌గా వ్యవహరిస్తున్నారు. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతూ వారిని ఉన్నత లక్ష్యాల వైపు మళ్లించేందుకు కృషి చేస్తున్నారు. ఆయన చేస్తున్న బహుముఖ సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు అకాడమీ ప్రతినిధులు వెల్లడించారు. జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



నల్ల రాధాకృష్ణ నుంచి జాతీయ స్థాయి అవార్డు అందుకుంటున్న యుగేందర్ సాయి

# కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలి

★ బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి ★ గ్యాస్ కొరత, ధరల పెరుగుదలకు కేంద్ర ప్రభుత్వ వినాధాలే కారణం

★ సీపీఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్

**మందమర్రి, మార్చి 16, ప్రభాతవార్త**

మందమర్రి మండల సమితి ఆధ్వర్యంలో మందమర్రి అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించి, పెరిగిన గ్యాస్, నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బీమనాథుని సుదర్శన్ పాల్గొని మాట్లాడుతూ... అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ నియంతగా వ్యవహరిస్తూ తన ఆధిపత్యాన్ని చలాయించడం కోసం ప్రభుత్వ అధినేతలను ఎత్తుకెళ్లి నిర్బంధించడం, ఇరాన్ పై ఇజ్రాయిల్‌తో కలిసి ఏకపక్షంగా దాడులు నిర్వహించి ప్రపంచ సంక్షోభానికి కారణమవుతున్నా భారత ప్రధాని నరేంద్రమోడీ ఆమెరికాను పల్లెత్తు మాట అనకుండా, ఎవరి దగ్గర చమురు కొనాలో ఆమెరికా అధ్యక్షుడు అనుమతి తీసుకోవాల్సి రావడం ఆమెరికాకు దాసోహమై దేశ స్వారభౌమత్వాన్ని మంటగలిపారని ఆక్షేపించారు. యుద్ధం జరుగుతుండగా భారతదేశం వద్ద గ్యాస్, పెట్రోల్ నిలువలు ఉన్నాయని మేకపోతు గంభీరం చూపెట్టి



నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులు

ఇప్పుడు ఒకసారిగా ప్రజలపై భారం రుద్దే విధంగా గ్యాస్ ధరలను పెంచడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర ఒకేసారి రూ.60 పెంచడం, గ్యాస్ సిలిండర్ల తీవ్ర కొరత ఏర్పడడంతో హోటల్స్, హాస్టల్స్ మూసి వేసుకోవాల్సిన పరిస్థితి దాపురించన్నారు. ప్రజలు చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని దుయ్యబట్టారు. ఇది పూర్తిగా ప్రధాని నరేంద్రమోడీ బాధ్యతా రహితమైన విధానాలే కారణమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను తగ్గించాలని బ్లాక్ మార్కెట్ను అరికట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మందమర్రి పట్టణ కార్యదర్శి కామెర దుర్గరాజ్, జిల్లా సమితి సభ్యులు, మిట్టపల్లి పౌలు, వనం సత్యనారాయణ, మామిడి గోపి, ఎగుడ మొండి, సిపిఐ నాయకులు రాయబారపు వేంకన్న, బండారి రాజేశం, మేరుగు రాజేశం,ఆంథోనీ దినేష్, కే దేవా నంద్, దొంతుల రాజం, దాసరి జనార్దన్, ఉప్పులేటి తిరుపతి,గుమ్ముల శ్రీనివాస్, గడ్డం సంతోష్, అవుల దుర్గ ప్రసాద్, దబ్బేట అరుణ్, హమాలి కార్మికులు, సంపత్, పోశం, సుమన్, తదితరులు పాల్గొన్నారు.





## వీధి కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు

**జన్నారం, మార్చి 16, ప్రభాతవార్త**

జన్నారం మండలం లింగయ్యపల్లి గ్రామానికి చెందిన ఆరు సంవత్సరాల వయసు గల యాదగిరి ఆదిత్య అనే బాలుడిపై వీధి కుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. బాలుడు ఇంటి ముందు ఆడుకుంటూ ఉండగా ఓ కుక్క దాడి చేసి పెదవి, చెంపలను కొరికింది. ఆ సమయంలో అక్కడ వున్న ఇరుగు పొరుగు వారు పరుగున వచ్చి కర్రలతో దాడి చేయగా కుక్క పారిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. బాలున్ని చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు తల్లిదండ్రులు యాదగిరి గోపాల్, శిరీష విలపిస్తూ తెలిపారు.



## విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఈ ఉపాధ్యాయుడి పాత్ర చాలా అభినందనీయం

**జన్నారం, మార్చి 16, ప్రభాతవార్త**

విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుడు లక్ష్మయ్య పాత్ర చాలా అభినందనీయం అని జన్నారం మండలంలోని లోతొర్రె గ్రామ సర్పంచ్ బోడ శంకర్ అన్నారు. ఆ గ్రామ ఎంపీపీస్‌లో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న లక్షుఘుఘు మ్రయ్య బదిలీ కావడంతో ఆయనకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..గత ఏడు సంవత్సరాల నుండి లోతొర్రె ఎంపీపీస్ గ్రామ విద్యార్థులకు ఎంతో మంచి చదువు నేర్పించి మారుమూల గిరిజన గ్రామ విద్యార్థులని జిల్లా స్థాయి వరకు తీసుకెళ్లడంలో లక్ష్మయ్య ఎంతో కృషి చేశారని అన్నారు.ఈ సందర్భంగా లక్షుఘుఘుమ్రయ్యను విద్యార్థులు దుఃఖంతో విడ్కోలు పలుకుతూ శాలువాతో ఘనంగా సత్కరించి సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మండాడి నానేశ్వర్, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఉపాధ్యాయులు స్పందన, కుమార సమ్మీ, అంగన్వాడి టీచర్ కవిత, గ్రామస్తులు ఉన్నారు.

## పీసీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**జన్నారం, మార్చి 16 ప్రభాతవార్త**

పీసీఆర్ ఫౌండేషన్ స్థాపించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా తల సేమియా బాధితుల కోసం సోమవారం జన్నారం మండల కేంద్రంలో పీసీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు సుమారు 50 మంది దాతల నుంచి రక్తం సేకరించారు. పీసిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కేసీఆర్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి సంవత్సరం అయిందని, ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని, మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు.ఈ కిష్టాపూర్ సర్పంచ్ వాసాల నరేష్, పొనకల్ సహకార సంఘం మాజీ చైర్మన్ అల్లం రవి, పొనకల్ ఉపసర్పంచ్ అప్పాల జలపతి, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, నాయకులు ఫజాల్ ఖాన్, మున్వర్ అలీ ఖాన్, కాంగ్రెస్ నాయకులు ముత్యం రాజన్న, రజాక్, మోసిన్ ఖాన్, బిజెపి నాయకులు గోలి చందు, సందవేణి పవన్, ఎం ఆర్ పీ ఎస్ మండల అధ్యక్షులు ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.



## చేడ్వాయి వారసంత వేలం

**పెంచికల్‌పేట్, మార్చి 16, ప్రభాతవార్త :**

పెంచికల్‌పేట్ మండలంలోని చేడ్వాయి గ్రామంలో ప్రతి వారం నిర్వహించే వారసంత వేలాన్ని ఈ నెల 18న ( బుధవారం ) ఉదయం 10.గంటలకు నిర్వహించనున్నట్లు కార్యదర్శి జయ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనాలనుకునేవారు ముందుగా రూ. 2వేల డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు నిర్ణీత సమయంలో హాజరై వేలంలో పాల్గొనాలని ఆమె కోరారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

### - తహసిల్దార్‌కు వినతి పత్రం ఇచ్చిన బిజెపి నాయకులు

**తాండూర్, మార్చి 16, ప్రభాతవార్త :**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బిజెపి నాయకులు కోరారు. తహసిల్దార్ జ్యోత్స్న కు సోమవారం నాయకులు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, పేదలకుగృహ నిర్మాణ పథకం, రైతు భరోసా, భూ సమస్యల పరిష్కారం వంటి అనేక హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. రైతు భరోసా సమయానికి అందక పోవడంతో రైతులు పెట్టుబడుల కోసం అప్పులు చేస్తున్నారన్నారు. పెన్షన్, ఇండ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకున్న ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. నివాస, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు సకాలంలో మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు భరత్ కుమార్,నాయకులు తిరుపతి, శేషగిరి,శ్రీకృష్ణ దేవరాయలు, మల్లేష్, శీతాల్, కొమండ్ల శ్రీనివాస్నాగభూషణం, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



తహసిల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం ఇస్తున్న బిజెపి నాయకులు



## ప్రాథమిక పాఠశాలను సందర్శించిన సర్పంచ్

**వాంకిడి, మార్చి 16, ప్రభాతవార్త :**

వాంకిడి మండల కేంద్రంలోని ఇందిరానగర్ లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సర్పంచ్ చూనార్కర్ సతీష్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల గదులను, మధ్యాహ్న భోజన వంటశాలను, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాఠశాలలో త్రాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా చూడాలని వంట ఏజెన్సీని ఆదేశించారు. విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కార్యదర్శి శివ ,6వ 7వ వార్డుషేక్ సహీద్, అల్లోజు సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా మహేందర్

**తాండూర్, మార్చి 16, ప్రభాతవార్త :**




తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) సోషల్ మీడియా తాండూర్ మండల కోఆర్డినేటర్ గా దుర్గం మహేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు మహేందర్ కు టీపీసీసీ రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్ మన్నే సతీష్, సెక్రెటరీ కోట వినయ్ పవన్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. నాపై ఎంతో నమ్మకం ఉంచి నాకు అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

## కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి: బీజేపీ డిమాండ్

**దస్తురాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ దస్తురాబాద్ మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు రాక లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో పెట్టుబడికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భూ భారతి, సాదాబైనామా దరఖాస్తులను త్వరగా పరిష్కరించి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకూడదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దస్తురాబాద్ బీజేపీ మండల అధ్యక్షుడు పానుగంటి రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కొడిమల లక్ష్మణ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



బోరు మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్

## గ్రామ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తా

### - సర్పంచ్ కోల మహేష్

**దస్తురాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:**

రేవోజిపేట గ్రామంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని గ్రామ సర్పంచ్ కోల మహేష్ తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో పాడైపోయిన మంచినీటి బోర్లకు సోమవారం ఆయన దగ్గరుండి మరమ్మత్తులు చేయించారు. ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో గ్రామస్థులకు తాగునీటి ఇబ్బందులు కలగకూడదనే ముందుచూపుతో ఈ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కోసం మరిన్ని నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని, ప్రతి వార్డులో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కారోబార్ సత్తన్న, సిబ్బంది పాల్గొన్నారు.

## అత్యవసర సమయంలో రక్తదానం.. మానవత్వం చాటుకున్న రాకేష్

**భైంసా, మార్చి 16, ప్రభాతవార్త:**




భైంసా ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉజ్వల అనే రోగికి ఏ పాజిటివ్ రక్తం అత్యవసరమవ్వగా, ఇలేగాం గ్రామానికి చెందిన రాకేష్ వెంటనే స్పందించి రక్తదానం చేశారు. భైంసా ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌లో సిబ్బందిగా పనిచేస్తున్న ఆయన, విధి నిర్వహణలోనే కాకుండా వ్యక్తిగతంగానూ సేవాభావం చాటుకుంటూ పలువురికి ప్రాణదాతగా నిలుస్తున్నారు. తలసేమియా, క్యాన్సర్, అత్యవసర స్థితిలో ఉన్న రోగుల కోసం రక్తదాన శిబిరాల ద్వారా రక్తాన్ని సేకరించడంలో ఆయన కృషి ఎంతో ఉంది. నిరంతరం అందుబాటులో ఉంటూ రక్తాన్ని నిల్వ చేయడం, అవసరమైన వారికి వేగంగా అందించడంలో ఆయన చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచి రక్తదానం చేసిన రాకేష్‌కు రోగి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజావాణి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, మార్చి 16, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారం పై అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్యతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఆఫీస్ మెయింటెనెన్స్ సబార్డినేట్ యూనియన్ ప్రతినిధులు దేవేందర్, రజిత తమ దరఖాస్తులో ఎంసిసి ఆఫీస్ మెయింటెనెన్స్ సబార్డినేట్‌లకు గత 10 నెలలుగా పెండింగ్ లో ఉన్న వేతనాలను ప్రస్తుత నిత్యవసరాల దృష్ట్యా పరిశీలించి అందించాలని కోరారు. బెల్లంపల్లి పట్టణంలోని 17వ వార్డు షంషేర్ నగర్ స్కూల్ చెందిన లక్ష్ముుుుుణరావు తమ ప్రాంతంలోని ప్రభుత్వ వాటర్ ట్యాంక్‌ను మున్సిపల్ అధికారుల సమన్వయం లేకుండా కూల్చి ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండలం మామిడిగట్టు గ్రామానికి చెందిన కోట లక్ష్మి తన భర్త వికలాంగుడని, తన కుమారుడు 7వ తరగతి చదువుతూ గురుకుల పరీక్ష రాసాడని, సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లాలోని కొత్తూరు గ్రామ రైతులు తాము గత సీజన్‌లో పండించిన సన్న రకం వడ్లు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించామని, ఇందుకుగాను బోనస్ డబ్బులు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. తాండూర్ మండలం మాదారం గ్రామానికి చెందిన మహమ్మద్ ముజాహద్ హుస్సేన్ గ్రామ శివారులో తనకు గల భూమి నుండి కొంత భాగాన్ని ఇతరుల పేరుట అక్రమంగా పట్టా చేశారని, ఈ పట్టాను రద్దు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండలం రెబ్బెనపల్లి మత్స్య సహకార సంఘం సభ్యులు ఎన్నికలను నూతన సభ్యుల పేర్లు నమోదు చేసే వరకు నిలిపివేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లాలోని సర్వాయిపేట గ్రామానికి చెందిన ఆలం మల్లేష్ తమ కుటుంబ సభ్యుల పేరిట ఉన్న భూమిని వారు మరణించినందున వారసలమైన తమ పేరిట మార్చాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైపూర్ మండలం ముదిగుంట గ్రామానికి చెందిన దుర్గమ్మ నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు



అనంతరం ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల అధికారులు, ఆయా కార్యాలయాల సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని తెలిపారు. వెనుకబడిన తరగతులు, షెడ్యూల్ కులములు, షెడ్యూల్ తెగల వసతి గృహాలలో ఏమైనా మరమ్మత్తులు ఉన్నట్లయితే సంబంధిత ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని తెలిపారు. నీటిపారుదల, వ్యవసాయం, పంచాయతీరాజ్ శాఖల అధికారులు తమ పరిధిలోని సమస్యలపై దృష్టి సారించాలని, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో లోతట్టు ప్రాంతాలలో వరదల కారణంగా ఇబ్బందులకు గురయ్యే గృహ నివాసాలను గుర్తించి పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాలని తెలిపారు. ఆయా శాఖల అధికారులు సమర్పించే నివేదికల ఆధారంగా ప్రజా ప్రయోజనార్థం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాఘవేంద్ర లిటిల్ హాన్స్ పాఠశాల విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం

**జన్నారం, మార్చి 16, ప్రభాతవార్త**



జన్నారం మండల కేంద్రంలోని రాఘవేంద్ర లిటిల్ హాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు కార్యక్రమంలో భాగంగా రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని అగ్ని ప్రమాదాలపై అవగాహన, భద్రత కల్పించేందుకు విద్యార్థులకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండల ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ విద్యార్థులతో మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణ, భద్రతా చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో వివరంగా తెలియజేశారు. అలాగే అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు భయపడకుండా సరైన విధంగా ఎలా వ్యవహరించాలో విద్యార్థులకు వివరించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వెంటనే బయటకు ఎలా వెళ్లాలి, ఫైర్ ఎక్స్టింగ్విషర్‌ను ఎలా ఉపయోగించాలి, అలాగే అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా విద్యార్థులకు ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థుల్లో భద్రతపై మరింత బాధ్యతను పెంపొందించారు. ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండి అగ్ని ప్రమాదాలపై అవగాహన, నివారణ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి మంచి అవగాహన కల్పిస్తుందని అన్నారు. విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని ఎంతో ఆసక్తిగా వీక్షించి భద్రతపై ముఖ్యమైన విషయాలను నేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్, కరస్పాండెంట్ ఎర్ర సంపత్, డీన్ హేమలత షిండే, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో రక్తదాన శిబిరం

**జైపూర్, మార్చి 16, ప్రభాతవార్త**

జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో సోమవారం రెడ్ క్రాస్ వారి ఆధ్వర్యంలో పవర్ మేక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థ రక్త దాన శిబిరం నిర్వహించారు. పవర్ ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెన్నకేశవుల చిరంజీవి జనరల్ మేనేజర్‌లు మధన్ మోహన్, నరసింహ రాజులు ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు రక్తదాన ప్రాముఖ్యతను వివరించి, మాట్లాడారు. రక్త దానం అనేది అనేక మంది ప్రాణాలను రక్షించగల గొప్ప మానవతా సేవ అని తెలిపారు. సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాల్లో ఉద్యోగులు, కార్మికులు చురుగ్గా పాల్గొనాలని వారు ప్రోత్సహించారు. రక్తదాన శిబిరంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు కార్మికులు ఉత్సాహంగా పాల్గొని తమ రక్తాన్ని దానం చేశారు. వారి స్వచ్ఛంద సేవా భావం సహకారం వల్ల ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. మొత్తం 70 యూనిట్ల రక్తం ఈ శిబిరంలో సేకరించబడింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతి రక్తదాతకు రెడ్ క్రాస్ సొసైటీ వైద్య బృందానికి నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జనరల్ సెక్రటరీ చందూరి మహేందర్, అధికారులు దరావత్ పంతులా, కిరణ్ బాబు, డాక్టర్ జానకిలు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఆత్మ చైర్మన్ తాళ్లపల్లి శ్రీరామారావు



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి రామకృష్ణ

# సహజ వ్యవసాయమే భవిష్యత్‌కు బాట

**- ఆత్మ చైర్మన్ తాళ్లపల్లి శ్రీరామారావు - ఫామ్ మెకనైజేషన్ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు వ్యవసాయ పనిముట్లను పంపిణీ**

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 16, ప్రభాతవార్త

సహజ వ్యవసాయమే భవిష్యత్‌కు బాట అని ఆత్మ చైర్మన్ తల్లపల్లి శ్రీ రామారావు అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ మండలంలో సహజ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆత్మ చైర్మన్ తల్లపల్లి శ్రీ రామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహజ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. జీవామృతం, నిమ్ ఆయిల్ మరియు పశువుల ఎరువు వంటి సహజ పదార్థాలను వినియోగించడం ద్వారా నేల సారాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్ తరాలకు సారవంతమైన భూమిని అందించవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా ఫామ్ మెకనైజేషన్ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. ఏడీఏ మనోహర్, ఏఓ రామకృష్ణ మాట్లాడుతూ రైతులు ఈ పరికరాలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయ పనులను సులభతరం చేసుకోవాలని సూచించారు. రైతులు ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా సహజ వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకుని వాటిని తమ వనయవసాయంలో అలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ డైరెక్టర్లు, కాగజ్‌నగర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (ఏడీఏ), వ్యవసాయ అధికారులు (ఎంఎస్ఓస్), వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓ), వివిధ గ్రామాల రైతులు, ఆత్మ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం

**- పర్యావరణ శాస్త్రవేత్త బి తిరుపతి**

నిర్మల్, మార్చి 16, ప్రభాతవార్త:

ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి వాటిల్లుతున్న ముప్పుపై రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. భైంసా పట్టణంలోని జిపిఎల్ డిగ్రీ కళాశాలలో పర్యావరణ శాస్త్రవేత్త బి తిరుపతి నేతృత్వంలో సోమవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్పరిణామాలను ఆయన వివరించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా పర్యావరణానికి మేలు చేసే ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని సూచించారు. ముఖ్యంగా సిపిసిబి రిజిస్ట్రేషన్ కలిగిన, భూమిలో త్వరగా కలిసిపోయే బయోడిగ్రేడబుల్ సంచుల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలిపారు. రాబోయే తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించడం మనందరి బాధ్యతని పేర్కొన్నారు.



ప్లాస్టిక్ నష్టాలను వివరిస్తున్న పర్యావరణ శాస్త్రవేత్త బి తిరుపతి




అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

# షీటీం ఆధ్వర్యంలో బాలికలు, మహిళల భద్రతపై అవగాహన

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 16, ప్రభాతవార్త

కాగజ్‌నగర్ పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ లో షీ టీం ఆధ్వర్యంలో బాలికలు, మహిళల భద్రతపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ షీ టీం ఇన్‌చార్జి ఏఎస్ఐ సునీత మాట్లాడుతూ, విద్యార్థినులకు మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, ఆపద సమయంలో ఎలా స్పందించాలి, డయల్ 100 వినియోగం, సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్ వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. విద్యార్థినులు తమ హక్కులను తెలుసుకుని ధైర్యంగా ముందుకు సాగాలని, ఎలాంటి వేధింపులు ఎదురైన వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా సమస్యలకు గురైతే కాగజ్‌నగర్ షీ టీం నంబర్ 8712670565 కు వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఆర్‌జె సిరి, ఉపాధ్యాయులు, షీ టీం సభ్యులు బి.రమాదేవి, శ్రీనివాస్, సునీత తదితరులు పాల్గొన్నారు.

# జైపూర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా కాసిపేట సతీష్

జైపూర్, మార్చి 16, ప్రభాతవార్త

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సోషల్ మీడియా విభాగంలో మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కోఆర్డినేటర్‌గా నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కాసిపేట సతీష్ కుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా చెన్నూరు మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణల ఆశీస్సులతో రాష్ట్ర సోషల్ మీడియా చైర్మన్ మన్నె సతీష్, రాష్ట్ర సోషల్ మీడియా సెక్రటరీ వినయ్ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించినందుకు సతీష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని అన్నారు. గ్రామాల్లో మిగతా సోషల్ మీడియా వారియర్స్ తో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు అభివృద్ధి కార్యక్రమాలు మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని సతీష్ కుమార్ పేర్కొన్నారు.

# తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ఉపాధ్యాయుల అండ

పెంచికల్‌పేట్, మార్చి 16, ప్రభాతవార్త :

మండలంలోని పెంచికల్ పేట్ గ్రామానికి చెందిన కోడూరి వెంకన్న క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మూడు రోజుల క్రితం మరణించగా, ఆయన భార్య పుష్ప గత నాలుగు సంవత్సరాల క్రితం విద్యుత్ షాక్ తో మృతి చెందింది. తల్లిదండ్రుల మరణంతో అనాథలుగా మారిన ( ఇద్దరు ఆడ, ఒక మగ,) ముగ్గురు పిల్లల కుటుంబాన్ని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెంచికల్ పేట్ ఉపాధ్యాయులు సోమవారం పరామర్శించారు. పిల్లల పరిస్థితిని తెలుసుకొని మానవత్వంతో స్పందించిన ఉపాధ్యాయులు వారికి ఆర్థిక సహాయంగా రూ, 10000 వేలు అందజేశారు. ఈ సందర్భంగా పిల్లలకు ధైర్యం చెప్పి, వారి చదువుకు తాము అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, ఉపాధ్యాయ సిబ్బంది, సర్పంచ్ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

# శివ మల్లన్న ఆలయంలో భక్తి పరవశం

**- బహుళ త్రయోదశి సందర్భంగా నందికేశ్వర స్వామికి అభిషేకం**

కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త :

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఇస్గాం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ శివ మల్లన్న స్వామి వారి దేవాలయంలో సోమవారం భక్తి పరవశం నెలకొంది. బహుళ త్రయోదశి సందర్భంగా శ్రీ నందికేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం ఆలయ అర్చకులు సంతోష్ శర్మ ప్రత్యేక పూజలు చేసి అభిషేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభిషేకాన్ని దర్శించుకుని, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులు శ్రీ శివ మల్లన్న స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ధన్యులయ్యారు. గ్రామస్థులు, భక్తులు భక్తిశ్రద్ధలతో ఈ దైవ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



నందికేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు